

# అమెరి "కలగూరగంప" కామెడి

## వంగూరి చిట్టెన్‌రాజు



## "ఎన్నారై హరితాకీ చున్నా" కథ

### 11

**నేను బొంబాయిలో ఉన్నప్పుడు మా ఐ.ఐ.టీ** కేంపస్‌లో ఉన్నవాళ్ళంతా ఒక రకం కొత్త భాష మాట్లాడేవాళ్ళం. ఆ మాటకొస్తే బొంబాయిలో అందరూ ఆ భాషే మాట్లాడేవారు. అది ఏ భారతీయ భాషో ఎవరికీ తెలియక దాన్ని "హింగుమతెతమకబెం" అని పిల్చుకునే వాళ్ళం. అంటే ఏం లేదు, ఆ మహా నగరంలో అన్ని రకాల భాషలవారూ, వారి పదాల్ని కూడా కలిపేసి ఒక కొత్త రకం హిందీ సృష్టించారు. అంటే హిందీ, గుజరాతీ, మరాఠీ, తెలుగు, తమిళం, మలయాళం, కన్నడ మరియు బెంగాలీ వారు కలిసిమెలిపి ముచ్చటించుకునే వాళ్ళం. కొంచెం హిందీ మాటలు ఎక్కువ ఉండేవి కాబట్టి పైకి హిందీలోనే మాట్లాడుతున్నాం అనుకునే వాళ్ళం. ఒకసారి అలహాబాద్ నించి సచ్‌దేవ్ అనే ఒక అసలు సిసలు ఉత్తర ప్రదే"స్" వాడు వచ్చి మా భాష విని "ఇదేం భాష, మద్రాసీ హై క్యా?" అని అడిగాడు. నేను అప్పుడే కాకినాడనించి దిగుమతి అయి, హిందీలోనూ, ఇంగ్లీషులోనూ కూడా మాట్లాడేస్తున్నానోచ్ అని గర్వంగా కాలరెత్తుకుని "ఇది మీ భాషే భయ్యా, హిందీ..హిందీ హమారా మాతృభాషా హైనా?" అనగానే వాడు గుండె ఆగి బక్కెట్ తన్నేశాడు, ఇంచుమించు.  వాడు పూర్తిగా బకెట్ తన్నేసిన యడల నేను ఇంకా హత్యా నేరం క్రింద తీహార్ జైల్లో ఉండి కనుమొళీ, కల్మాడీ, టెలికాం రాజా, ఖర్మ కాలితే జగన్‌కో స్వాగతం, సుస్వాగతం అంటూ ఆహ్వానిస్తూ ఉండేవాణ్ణి.

ఆ రోజుల్లోనే నేను ఇనుస్ట్రుమెంటేషన్ అనే పాఠ్యాంశం కూడా కుర్రాళ్ళకి పాఠం చెపుతూ ఉండేవాణ్ణి. ఆనాడు నా చేత క్లాసు పీకించుకున్న వారిలో ఈ నాటి కేంద్ర మంత్రి జైరాం రమేష్ ఒకడు. ఆ క్లాసులోనే కేంపస్‌లో ఉన్న నలుగురంటే నలుగురంటే నలుగురు అమ్మాయిలలోనూ, నూర్జహాన్ అని ఒకే ఒక్క చక్కని చుక్క కూడా ఉండేది. కానీ ఆ పిల్ల ఎప్పుడూ నన్నే చూస్తూ, బెంచీ మీద అటూ ఇటూ కదులుతూ వగలు పోయేదే కానీ పాఠం వినేది కాదు. అందువలన నేను కూడా ఆ అమ్మాయి దారిలో పెట్టడానికి అస్తమానూ ఆ బెంచీ కేసే చూస్తూ పాఠం చెపుతూ ఉండే వాణ్ణి. లక్కీగా అక్కడి అరేబియా సముద్రానికి వెయ్యి మైళ్ళు తూర్పు వేపు బంగాళాఖాతం ఒడ్డున ఉన్న విశాఖపట్నంలో ఉన్న మా క్వీన్ విక్టోరియా నాకూ, నూర్జహాన్‌కీ మధ్య జరుగుతున్న పరస్పర వీక్షణా కార్యక్రమాన్ని వీక్షించలేదు కాబట్టి సరిపోయింది. నేను ఆ అమ్మాయి సంగతి ఎప్పుడో మర్చేపోయాను కానీ, నా ప్రాణాలకి ఇటీవల ఆ నాటి నా పూర్వ విద్యార్థి వెధవ ఒకడు వచ్చి, అది నాకు గుర్తుచేసే నెపంతో మా క్వీన్‌కి చెప్పగానే, ఆవిడ "పోనీ నూర్జహాన్ అభీ కహాఁహై తెరియుమా,

యు కెన్ కంటిన్యూ అండ్ ఐ కెన్ హేపీలీ లివ్ ఎవరాఫ్టర్, గౌత్తా" అని "హింగుమతెతమకబెం" భాషలో గాఢంగా నిట్టుర్చింది. ఇందులో నీతి ఏమిటంటే, చిన్నప్పటి స్నేహితులు కానీ. పూర్వ విద్యార్థులు కానీ ఇప్పుడు మనింటికి వస్తామంటే, అమాంతం కావలించేసుకుని పాత విషయాలు నెమరు వేసుకునే ముందే వాళ్ళకి ప్రశ్నాపత్రం ఇచ్చి, సమాధానాలని రాబట్టి అప్పుడు వాళ్ళు మనింటికి రావడానికి మనం బిజీగా ఉంటామో, ఖాళీగా ఉంటామో నిర్ణయించుకోవాలి. అనుమానం వస్తే "అబ్బే, నీకెందుకు అంత శ్రమ, ఎక్కడున్నావో చెప్పు, నేనే వస్తాను" అని తప్పించుకోవాలి.

ఆ రోజుల్లోనే నేను ఇంజనీరింగు పరికరాలు తయారు చేసే ఒకనొక కంపెనీకి కన్సల్టింగ్ పని చేసే వాణ్ణి. అంటే నెలవారీ జీతం కాదు కానీ, వాళ్ళ తయారీలో లోపాలు సరిదిద్దితే ఐ.ఐ.టీకి ఆరు వేలూ, నాకు అరవై రూపాయలూ ఇచ్చేవారు. ఒకసారి నేను వాళ్ళ ఫేక్టరీకి వెళ్ళినప్పుడు, వాళ్ళు తయారు చేసే ప్రెషర్‌గేజ్ అనే ఇన్‌స్ట్రుమెంట్ విభాగంలో ఒకటి అమెరికా, మరొకటి భారత్ అని దేనికవి రెండు రకాల విభాగాలు కనపడ్డాయి. 'తయారు చేసే పరికరం ఒకటే కదా, రెండు విభాగాలెందుకూ, అన్నీ కలిపితే ఖర్చులు తగ్గుతాయి కదా' అని నేను నా మొదటి సలహా ఇవ్వగానే ఆ ఫేక్టరీ యజమాని గుజరాతీలో ఫెళ్ళున నవ్వి, 'అలా ఎలా కుదురుతుంది సార్, మన వాళ్ళచేత ఎంత చెత్త సరుకైనా కొనుపించగలం కానీ ఈ అమెరికా వాళ్ళు అలాగ కాదు, క్వాలిటీ, గాడిద గుడ్డూ అంటూ ప్రాణం తీస్తారు. అంచేత ఒళ్ళు దగ్గరపెట్టుకుని వస్తువులు తయారు చెయ్యాలి కదా' అని నాకు రాజనీతి బోధ చేసి, నా కన్సల్టింగ్ కాంట్రాక్ట్ వెంఠనే కేన్సిల్ చేశాడు. "ఎక్స్ పోర్ట్ క్వాలిటీ" అనే మాట అప్పుడే మొట్టమొదటి సారి విన్నాను. అది వినగానే "అవును సుమా, ఎప్పుడూ మన సొంత పెళ్ళాం కంటే, పక్కింటి పాపారావు పెళ్ళాన్ని ఇంప్రెస్ చెయ్యడమే ముఖ్యం కదా" అనిపించింది. అప్రస్తుత ప్రసంగం చేస్తే వచ్చే అనర్థాలు కూడా అప్పుడే నాకు అర్థం అయినా ఆ రోగానికి ఇంకా మందు దొరక లేదు.

ఆ తరవాత గత అనేక దశాబ్దాలుగా కేవలం మనవాళ్ళే పాటించే ఈ "ఎక్స్‌పోర్ట్ క్వాలిటీ" పద్ధతి అన్ని రంగాలలోనూ గమనించాను. ఉదాహరణకి, ఇండియాలో ఉన్న మేధావులని అర్జంటుగా అమెరికాకి ఎగుమతి చెయ్యడానికి మన్మోహన్ మహాశయుడు నానా తంటాలూ పడి, దానికోసం ఒక కేబినెట్ మంత్రినే నియమించారు. మన సాఫ్ట్‌వేర్ మరియు హార్డ్‌వేర్ అమెరికాకి ఎగుమతి చెయ్యడం కోసం మన మాతృభాషనే ఖూనీ చేసి కేవలం ఆంగ్లంలో మాత్రమే విద్యాబోధన చేసే విధానాలని ప్రవేశ పెట్టి ప్రఖ్యాతి చెందారు ఒక మాజీ ముఖ్యమంత్రి. ప్రతీ రోజూ ఏ తెలుగు వార్తా పత్రిక చూసినా "ఫలానా డిప్ప వెధవ" అమెరికా యాత్ర అనో, "ఫలానా చచ్చు వెధవ" అమెరికా యాత్ర విజయవంతంగా ముగించి తిరిగి రాక" అనో ప్రకటనలు కనపడుతూనే ఉంటాయి. వారికి సన్మానాలూ జరుగుతూనే ఉంటాయి. ఆ మహాశయుడి భార్య కూతురి పురుడుకోసం అమెరికా వచ్చిందనీ, ఆవిడ పెట్టెలు మోసే కెపాసిటీలోనే ఈ మహాశయుడు అమెరికా విచ్చేశారనీ ఎవరికీ తెలియని చిదంబర రహస్యం. అమెరికాలో పశువుల గ్రాసం ఏ విధంగా తయారు చేయుదురు, మన ఇండియా గడ్డిని "ఎక్స్ పోర్ట్ క్వాలిటీ" గడ్డిలా తీర్చిదిద్ది అమెరికాకి ఎలా ఎగుమతి చెయ్యాలి అనే విషయం మీద నిజానిజాలు తెలుసుకునే ఉద్దేశ్యంతో...అనగా "ఫేక్ట్‌ఫైండింగ్ మిషన్" మీద మంత్రి గారూ, ఐ.ఏ.యస్ అధికారులూ, ఆంధ్రప్రదేశ్ ఇంటర్నేషనల్ సొసైటీ ఆఫ్ గడ్డి గాదమూ వారి అధ్యక్షులూ, వారి సతీమణీ మరియు ఆ సంఘానికి ఉపాధ్యక్షులూ నయాగరా జలపాతాలు చూసి వెనక్కి వెళ్ళిపోయిన ప్రముఖులూ నాకు తెలుసు.

ఇదంతా నాకు ఎందుకు జ్ఞాపకం వచ్చిందంటే మొన్న ఏదో చపాతీలు కొనుక్కోడానికి మన వాళ్ళ ..అనగా గుజరాతీ వాళ్ళు మాత్రమే నడపగలే ఒకానొక కిరాణా కొట్టుకి వెళ్ళాను. లోపలికి వెళ్ళగానే "అభీ ఆయా..దేఖో, అత్యంత చవక, " అంటూ మరొక మూడు భాషల్లో.. అనగా "హింగుమతెతమకబెం" భాషలో తళ తళ లాడే దీపాలతో ఒక అలమారా కనపడింది. అదేదో చూద్దామని దగ్గరికి వెళ్ళి చూడగానే....అక్కడ ఎనిమిది రకాల సున్నం డబ్బాలు...అవును...మనం తమల పాకులు ఈనెలు తీసేసి రాసుకునే సున్నం డబ్బాలు కనపడ్డాయి. అందులో ఒక ప్రత్యేక గెటప్‌లో మిలమిల లాడుతున్న డబ్బా నన్ను ఆకర్షించింది. ఎందుకంటే దాని మీద పెద్ద

అక్షరాలతో "ఎన్నారై హరితాకీ చున్నా, "ఎక్స్ పోర్ట్ క్వాలిటీ" అని కనపడింది. సున్నం ఎగుమతికి కూడా ఎన్నారై కలర్ ఏమిటా, హరితాకీ అనగా ఏమిటీ అని ఇంకా పరీక్షగా చూస్తే ఆ పదం కిందనే "ఎన్నారైల కోసం ప్రత్యేక మూలికలతో తయారు చెయ్యబడిన అతిసునాయాస సుఖ విరోచన కారి" అని నాలుగు భాషలలో, నాలుగు రంగులలో కనపడ్డాయి. పక్కనే ఒక ఎన్నారై బొమ్మ చున్నా తినకముందు ఏడుపు మొహంతోనూ, రెండు చెంచాలు చున్నా తిన్నాక హాయిగా నవ్వు మొహంతోనూ ముద్రించబడ్డాయి. అప్పుడు నాకు ఒక ప్రగాఢమైన అనుమానం వచ్చింది. ఎన్నారైలు ఇండియా వెళ్ళగానే సాధారణంగా అందరికీ వచ్చే డయారియా కోసం ఈ సున్నం తయారు చెయ్యబడింది కాబట్టి మనం ఇండియా వెళ్ళే ముందు నాలుగు డబ్బాలు కొనుక్కోవాలా, లేక ఈ సున్నం అమెరికాలో దొరికే "లో డోసేజ్" మాత్రలు మనకి పనిచెయ్యవు కాబట్టి కేవలం ఎన్నారైల కోసం తయారు చెయ్యబడిన "హై డోసేజ్" పదార్ధమో నాకు తెలియ లేదు.

ఇదే ప్రశ్న నా పక్కనే ఉన్న క్వీన్ విక్టోరియాని అడగగానే తను కూడా ఆశ్చర్యపోయి, మరికొంచెం జాగ్రత్తగా చూసి "నీ మొహం, నీకు ఏ భాషా రాదు. "హింగుమతెతమకబెం" అసలే రాదు. ఇది చున్నా కాదు, చుర్నా...అంటే చూర్ణం...అంటే ఆయుర్వేదం మందు. నీ బుర్రలో ఉన్నది సున్నా...సారీ చున్నా... " అని అర్జంటుగా నాలుగు డబ్బాలు షాపింగ్ కార్ట్‌లో పడేసింది. ఆవిడ వారం రోజుల్లో ఇండియా వెడుతోంది.

అప్పుడు నాకు నిజంగా తెలిసింది "ఆడువారి మాటలకూ అర్థాలే వేరులే" అంటే ఏమిటోనూ! ఇది మా క్వీన్ విక్టోరియా విషయంలో అక్షరాలా నిజం. ఉదాహరణకి ఇదివరకు అమెరికాలో ఎక్కడికైనా వెళ్ళాలంటే నేను డ్రైవరు, ఆవిడ దిశా నిర్దేశం..అంటే డైరెక్షన్స్ చెప్పేదన మాట. ఆ రోజుల్లో ఆవిడ "ఇక్కడ కుడి పక్కకి తిరుగు" అంటే ఖచ్చితంగా మనం ఎడం పక్కకి తిరిగిపోవచ్చు. అలాగే శీతాకాలంలో "అబ్బ, చలి ఎక్కువగా ఉంది, కాస్త ఎయిర్ కండిషన్ ఎక్కువ చెయ్యి" అన్నా, వేసవికాలంలో "అబ్బబ్బ, వేడి ఎక్కువగా ఉంది, కాస్త ఏ,సీ తగ్గించు" అన్నా మనం దానికి ఆపోజిట్‌గా చేస్తేనే కానీ ఆవిడ కోరిక నెరవేరదు. అందుకే ఇప్పుడు ఆవిడ కొనడానికి తయారైన "ఎన్నారైల కోసం ప్రత్యేక మూలికలతో తయారు చెయ్యబడిన అతిసునాయాస సుఖ విరోచన కారి" డబ్బాలని వెనక్కి పెట్టేసి, "ఎన్నారైల కోసం ప్రత్యేక మూలికలతో తయారు చెయ్యబడిన సుఖ విరోచన విరోధకారి" ఎక్కడుందో గుజరాతీ కిరాణాకొట్టు యజమానిని అడగాలి. లేకపోతే ఇండియా వెళ్ళి పొరపాటున ఆ వెధవ మాత్రలు కూడా వేసుకుంటే అంతే సంగతులు!

●●●

Click here to share your comments on this article